క్లుప్తంగా

డంపింగ్‌యార్డు పరిశీలన



జడ్చర్ల: మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు నాగసాల సమీపంలో ఉన్న డంపింగ్‌యార్డును మున్సిపల్ చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి, కమిషనర్ మహమూద్‌షేక్ మంగళవారం పరిశీలించారు. యార్డులో బయోమైనింగ్ ఏర్పాటు కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. త్వరలోనే యార్డులో చెత్తను రీసైక్లింగ్ చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్లు ప్రకటించారు. వారి వెంట ఏఈ నర్సింహులు, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

విద్యార్థులకు అవగాహన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కుక్కల బెడద నుంచి ఎలా కాపాడుకోవాలో మున్సిపల్ అధికారులు కొన్ని రోజులుగా పట్టణంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఇదే విషయమై మంగళవారం శ్రీనివాసకాలనీలోని గీతం స్కూల్‌లో, గొల్లబండతండా, హనుమాన్‌పుర (ఉర్దూ మీడియం), షాషాబ్‌గుట్ట, ఎదిరలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వివరించారు. అలాగే కుక్కలను పెంచడానికి మాంసం, ఇతర వ్యర్థ పదార్థాలు వేయొద్దని మటన్, చికెన్ షాపుల యజమానులకు సూచించారు. ఈ మేరకు ఆయా షాపు యజమానులకు నోటీసులు అందజేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రవీందర్‌రెడ్డి, గురులింగం తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌పై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి

జడ్చర్ల టౌన్: కళాశాలలు, పాఠశాలలు, వైద్య కళాశాలల్లో ర్యాగింగ్‌పై ప్రభుత్వం దృష్టి సారించాలని బీసీసేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్ ప్రభుత్వానికి విన్నవించారు. మంగళవారం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో డీటీ వెంకటేశ్వరికి వినతిపత్రం అందజేశారు. ఉన్నత చదువుల కోసం కోటి ఆశలతో కళాశాలల్లోకి అడుగుపెడితే ర్యాగింగ్ భూతం వల్ల అర్ధాంతరంగా ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందన్నారు. మెడికో ప్రీతి చావుతోనైనా ఇలాంటి వాటికి స్వస్తి పలికేలా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని తమ విన్నపాన్ని ప్రభుత్వానికి పంపించాలన్నారు. వినతిపత్రం అందించిన వారిలో శ్రీనివాస్, నిరంజన్, శేఖర్, సురభివిజయ్, గోపాల్ ఉన్నారు.

గోవుల తరలింపు



చిన్నచింతకుంట: మండలంలోని అమ్మాపూరం సమీపంలో వెలసిన కురుమూర్తి స్వామికి భక్తులు కానుకలుగా సమర్పించిన ఆరు గోవులను మంగళవారం గోశాలలకు ఆటోలో తరలించారు. హన్వాడ మండలం చిన్నదర్పల్లి గోశాలకు నాలుగు, అడ్డాకుల మండలం కందూర్ రామలింగేశ్వర స్వామి గోశాలకు తరలించారు. కార్యక్ర మంలో సిబ్బంది శ్రీకర్, శ్రావణ్, పూజారి వెంకటేశ్వర చార్యులు తదితరులు ఉన్నారు.

ఘనంగా టైలర్స్ డే



మిడ్జిల్: టైలర్స్ డేను మంగళవారం మండల కేంద్రంలో టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ వద్ద కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజీవ్ రెడ్డి, కార్యక్రమంలో సర్పంచ్ రాధిక, ఎంపీటీసీ గౌస్, ఉపసర్పంచ్ పద్మ, బాలు, వెంకట్‌రెడ్డి, నర్సింహా, శ్రీనివాసులు, మహేష్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

దళితబంధును వినియోగించుకోండి

కోయిల్‌కొండ: దళితబంధు మంజూరైన లబ్ధిదారులు పథకాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలపడాలని ఎంపీడీఓ జయరాములు అన్నారు. మంగళవారం మండలంలోని వింజమూర్‌కు చెందిన గణేష్ దళితబంధు ద్వారా నారాయణపేటలో ఏర్పాటు చేసుకున్న లేడీస్ కార్నర్‌ను ఎంపీడీఓ పరిశీలించారు. మండలంలో 21మందికి దళితబంధు మంజూరైందని, లబ్ధిదారులు ఏర్పాటు చేసుకున్న యూనిట్లను సరిగా నడుపుకొని లాభాలు గడించాలని కోరారు.

పరామర్శ

గండీడ్: మండలంలోని బల్సూర్‌గొండకు చెందిన జగన్నాథ్‌రెడ్డి మండల కేంద్రంలో ఆదివారం ఫర్టిలైజర్ దుకాణానికి వెళ్లి తిరిగి వస్తుండగా, జక్లపల్లికి చెందిన గోపాల్ బైక్‌పై వేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఈ సంఘటనలో జగన్నాథ్ రెడ్డి మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని పరిగి ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, పెంట్యానాయక్, లక్ష్మీనారాయణ, గోపాల్, సర్పంచ్ వనజ, బాలవర్ధన్ రెడ్డి, రాంచంద్రారెడ్డి ఉన్నారు.

● ఘనంగా సైన్స్ దినోత్సవం

ఆలోచనలు.. ఆవిష్కరణలు

సాక్షి నెట్‌వర్క్: జిల్లావ్యాప్తంగా మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలలు, కళాశాలల్లో విజ్ఞాన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ఆవిష్కరణలు ఆలోచింపజేసేలాఉన్నాయి. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు రూపొందించిన ప్రదర్శనలు తిలకించి విద్యార్థులను ప్రిన్సిపాల్ గంగాధర్ అభినందించారు. అలాగే శ్రీప్రతిభ పాఠశాలలో సైన్స్ ఫెయిర్, ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి, యాజమాన్యం ఆనందర్‌రెడ్డి, రమణ, కమలాకర్ పాల్గొన్నారు.

■ మహబూబ్‌నగర్ రూరల్ మండలం ధర్మాపూర్ జెడ్పీ హైస్కూల్, నవాబుపేట మండలంలోని ఇప్పటూర్, కొత్తపల్లి, కల్మన్‌కల్వ, మరికల్, నవాబుపేట, మరికల్ ఠాగూర్ పాఠశాల, చాణుక్య పాఠశాల, జడ్చర్ల పట్టణంలో పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాల పాటు చిన్నచింతకుట మండలం అప్పంపల్లి జెడ్పీ పాఠశాల, మిడ్జిల్ ఉన్నత పాఠశాలల్లో వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించారు.

■ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో తక్షశిల హైస్కూల్‌లో సైన్స్ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రిన్సిపాల్ మనోహర్ మాట్లాడుతూ



జడ్చర్లలోని స్వామినారాయణ్ గురుకుల్‌లో ప్రదర్శన తిలకిస్తున్న విద్యార్థులు



అప్పంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..

విద్యార్థులు ప్రయోగాలను రూపొందించడం, పరిశీలించడం ద్వారా ఎంతో అవగాహన పెంపొందుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రఘు, కోఆర్డినేటర్ మధు పాల్గొన్నారు.

■ జిల్లాకేంద్రంలోని బాయమ్మతోట, రాజేంద్రనగర్‌లోని న్యూరిషి పాఠశాలల్లో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు వివిధ అంశాల్లో ప్రత్యేక ప్రాజెక్టులు తయారుచేశారు. ముఖ్యంగా సేంద్రియ ఆహార పదార్థాల ప్రాధాన్యం, వాతావరణంలో వచ్చే మార్పులు, మానవ శరీరంలోని అవయవాలైన మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, గుండె పనిచేసే విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలను అందులో వివరించారు. అనంతరం పాఠశాల చైర్మన్ వెంకటయ్య మాట్లాడుతూ ఉత్తమ పరిశోధకులుగా పేరు తెచ్చుకునేందుకు యత్నించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పూజితా మోహన్‌రెడ్డి, కోశాధికారి శిరీష ప్రవీణ్‌కుమార్, డైరెక్టర్లు చంద్రకళ, కృష్ణ సుషాంత్, ప్రిన్సిపాళ్లు రామకృష్ణ, మల్లికార్జున్, ఉప ప్రిన్సిపాల్ పార్వతీశం, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలోని శ్రీప్రతిభ పాఠశాలలో..



మిడ్జిల్‌లో..



నవాబుపేట మండలం ఇప్పటూర్‌లో..



ధర్మాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో..



తక్షశిల పాఠశాలలో..



న్యూరిషి పాఠశాలలో విద్యార్థుల ప్రదర్శనలు తిలకిస్తున్న యాజమాన్యం



రక్త పరీక్ష చేస్తున్న విద్యార్థులు

కంటి అద్దాలు పంపిణీ

భూత్పూర్: మండలంలోని మద్దిగట్లలో మంగళవారం కంటి అద్దాలను ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి పంపిణీ చేశారు. మండలంలోని మద్దిగట్ల, లంబాడికుంట తండాల్లో కంటివెలుగు కార్యక్రమంలో భాగంగా 262 మందికి కంటి పరీక్షలు చేయగా, 39 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. 73 మందికి కంటి ఆపరేషన్ కోసం రెఫర్ చేశారు. 57మందికి అద్దాలు పంపిణీ చేయాల్సి ఉందని సీహెచ్‌ఓ రామయ్య తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డా. హిమబిందు, డా.రాధిక, కార్యదర్శులు గోపి, సింధు, సిబ్బంది యాదమ్మ, అంజమ్మ, అప్తాలమెట్రిక్ అక్షయ్, ప్రవీణ్ కుమార్, వెంకటేష్, శివ తదితరులు ఉన్నారు.

కోడూరులో..

మహబూబ్‌నగర్ రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పాండు సూచించారు. మంగళవారం మండలంలోని కోడూర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించారు. అంధత్వ నివారణ కోసమే ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. అనంతరం ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.శ్రీకాంత్‌గౌడ్, ఆర్‌ఐ క్రాంతికుమార్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

సీసీ కెమెరాలు ముఖ్యం

మహబూబ్‌నగర్ క్రైం: ప్రతి కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో నేరాలు, దొంగతనాలు తగ్గించడానికి అవకాశం ఉంటుందని టూటౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని క్రిస్టియన్ కాలనీలో మంగళవారం రాత్రి కమ్యూనిటీ కనెక్ట్ అనే కార్యక్రమం కింద 25ఇళ్లను తనిఖీ చేశారు. ఆయా ఇళ్లలో నివాసం ఉండే వారి వివరాలు, గుర్తింపుకార్డు పరిశీలించారు.

పౌరహక్కుల దినోత్సవం

మిడ్జిల్: మండలంలోని కంచన్‌పల్లిలో మంగళవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఐ రామాంజనేయులు మాట్లాడుతూ అందరూ సమానమేనని అన్నారు. కలిసి, మెలిసి ఉండాలని సూచించారు. అనంతరం గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ అఖ్తర్‌బీ, రఫీక్, శేఖర్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యసహకార సంఘం ఎన్నికలు

మహమ్మదాబాద్: మండల కేంద్రంలో మత్స్యసహకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నికలు నిర్వహించారు. మొత్తం సహకార సంఘంలో మహమ్మదాబాద్, చిన్నాయపల్లి, షేక్‌పల్లి, కంచన్‌పల్లి, ధర్మాపూర్ గ్రామాల నుంచి 152 మంది ఓటర్లు ఉండగా, 139 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికలో 22 మంది డైరెక్టర్లు పోటీలో ఉండగా, 9మంది డైరెక్టర్లను ఎన్నుకున్నారు. కొత్త నర్సింహులు, చెన్నయ్య, సత్యయ్య, వెంకటయ్య, కేశవులు, చింతకింది కేశవులు, కోస్గి అంజిలయ్య, చెన్నయ్య, పెంటయ్యలు ఉన్నారు. కొత్త నర్సింహులును చైర్మన్‌గా, ఉపాధ్యక్షుడిగా సత్యయ్య, కార్యదర్శిగా కేశవులును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చెన్నయ్య, మత్స్య సహకార సంఘం ఎన్నికల అధికారులు లావణ్య, భాషన్న తదితరులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ల పట్టివేత

చిన్నచింతకుంట: మండలంలోని లాల్‌కోట గ్రామ ఊక చెట్టువాగు నుంచి మంగళవారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను ఎస్‌ఐ భాగ్యలక్ష్మారెడ్డి పట్టుకొని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మరికల్ మండల కేంద్రానికి చెందిన ఉప్పరి సతీష్, వనం అంజన్న, నరేష్‌లు లాల్‌కోట గ్రామ ఊకచెట్టువాగు నుంచి ఇసుకను జేసీబీ ద్వారా నింపి అక్రమంగా తరలిస్తుండగా రెండు ఇసుక టిప్పర్లు, జేసీబీని పట్టుకుని కేసు నమోదు చేశామన్నారు.

నవాబుపేట: అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పురుషోత్తం తెలిపారు. దుందుభీ నది నుంచి ఇసుకను తరలిస్తున్న చౌటపల్లికి చెందిన చెన్నయ్య అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి టిప్పర్‌ను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

జాతీయస్థాయిలో రాణించడం అభినందనీయం

మహబూబ్‌నగర్ క్రీడలు: జాతీయస్థాయి కరాటే పోటీల్లో విద్యార్థులు పతకాలు సాధించడం అభినందనీయమని జిల్లా వాలీబాల్ సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి, మున్సిపల్ కౌన్సిలర్ చెన్న వీరయ్య అన్నారు. జడ్చర్ల పట్టణంలో ఇటీవలే జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులను మంగళవారం జిల్లా కేంద్రంలోని వీరన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అభినందించారు. సీనియర్ కరాటే మాస్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ జాతీయ కరాటే పోటీల్లో ఆయా విభాగాల్లో శ్లోక, అనూష, శ్రావణి, హారిక ప్రథమ, సంజన, ఎ.అనూష, నందిని ద్వితీయ, అఖిల మూడోస్థానంలో నిలిచి పతకాలు సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉర్దూ మీడియం హెచ్‌ఎం అయేషా, పీఈటీ గీత, కరాటే మాస్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో విద్యార్థులను అభినందిస్తున్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

విద్యార్థికి సన్మానం..

మహబూబ్‌నగర్ క్రీడలు: విశాఖపట్నంలో ఇటీవల జరిగిన అంతర్జాతీయ కరాటే చాంపియన్‌షిప్‌లో ప్రతిభచాటిన జిల్లా కేంద్రంలోని మోడ్రన్ హైస్కూల్ విద్యార్థి సాయి ప్రణీత్, కరాటే శిక్షణ అందజేస్తున్న కింగ్‌షోటోకాన్ కరాటే క్లబ్ ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీని మంగళవారం పాఠశాలలో సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం దోమ దత్తు మాట్లాడుతూ అంతర్జాతీయ కరాటే పోటీల్లో పాఠశాల విద్యార్థి సాయి ప్రణీత్ అండర్-13 కటాస్ విభాగంలో బంగారు పతకం సాధించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పీఈటీ విలియం, ఉపాధ్యాయులు ఖాజా నిజాముద్దీన్, కరాటే బ్లాక్ బెల్టు ఆంజనేయులు, ఖాజాపాష తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ వచ్చినా బతుకులు మారలే



కందూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

అడ్డాకుల: ఎంతో మంది విద్యార్థుల ఆత్మ బలిదానాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడినా మన బతుకులు మాత్రం మారలేదని బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్ అన్నారు. మండలంలోని కందూర్‌లో శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ మున్నూర్ రమేష్, గట్టు మల్లేష్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రజాగోస-బీజేపీ భరోసా శక్తి కేంద్రం కార్నర్ మీటింగ్‌లో పార్లమెంట్ కన్వీనర్ డోకూర్ పవన్‌కుమార్ రెడ్డి, నియోజకవర్గ నాయకులు ఎగ్గని నర్సిములు, సుదర్శన్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు.అంతకుముందు గ్రామంలో బీజేపీ నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి రమేష్, శంకర్, కృష్ణయ్య, రాకేష్, రాఘవేందర్, మల్లేష్ పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: బీజేపీ బలోపేతానికి శక్తి కేంద్రాలు కృషి చేయాలని పార్టీ దళితమోర్చ జిల్లా కన్వీనర్ రాసమోని సాయిరాం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బీజేపీ కార్నర్ సమావేశం నిర్వహించారు.

గండీడ్: పేదలకు బీజేపీ అండగా ఉంటుందని బీజేపీ నాయకులు రాములు, శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని సల్కర్‌పేట్, వెన్నాచేడ్, కొంరెడ్డిపల్లి , పగిడ్యాల్ తదితర గ్రామాల్లో ప్రజాగోస బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్ నిర్వహించారు.

ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం

అడ్డాకుల: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కావాలంటే శాసనమండలిలో ఏవీఎన్ రెడ్డి లాంటి ప్రశ్నించే గొంతుక ఉండాలని టీపీయూఎస్ రాష్ట్ర నాయకుడు కరుణాకర్‌గౌడ్ అన్నారు. మూసాపేట మండలంలోని వేముల, పోల్కంపల్లి, జానంపేట, మూసాపేట, సంకలమద్ది కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం టీపీయూఎస్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డికి మద్దతుగా ప్రచారం చేపట్టారు. ఉపాధ్యాయులను కలిసి ఏవీఎన్ రెడ్డికి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. జీఓ 317 లోపాలు, ఆరోగ్య కార్డుల సమస్యలు, కేజీబీవీల సమస్యలు, పండితులు, పీఈటీల సమస్యల పరిష్కారం కావాలంటే టీపీయూఎస్ బలపర్చిన ఏవీఎన్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో టీపీయూఎస్ మండలాధ్యక్షుడు రవినాయక్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, జిల్లా నాయకులు ప్రకాష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మూసాపేటలో ప్రచారం చేస్తున్న నాయకులు

అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు

దేవరకద్ర: ఎరువులు, పురుగు మందులు ప్రభుత్వం నిర్ణయించిన ఎంఆర్‌పీ ధరలకే విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే లైసన్స్‌లు రద్దు చేస్తామని ఏడీఏ యశ్వంత్‌రావు హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని రాయిచూర్ రోడ్‌లో ఉన్న ఫర్టిలైజర్, ఫెస్టిసైడ్ షాపులను వ్యవసాయ అధికారులు తనిఖీ నిర్వహించారు. కొనుగోలు చేసిన బిల్లుల ప్రకారం స్టాక్, అమ్మకాల వివరాలను పరిశీలించారు. రైతులకు విక్రయించిన ఎరువులు, పురుగుల మందులు, విత్తనాలకు సంబంధించి బిల్లులు ఇవ్వాలని సూచించారు. తనిఖీలో మండల వ్యవసాయ అధికారి రాజేందర్ అగర్వాల్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు చూస్తున్న వ్యవసాయ అధికారులు



బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

పోచమ్మ బోనాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: మండలంలోని దివిటిపల్లిలో మంగళవారం పోచమ్మ బోనాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపు నిర్వహించి అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాల సందర్భంగా పోతురాజుల విన్యాసాలు అలరించాయి. వేడుకల్లో రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

రాయితీలు సద్వినియోగం చేసుకోవాలి

భూత్పూర్: ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు రాయితీ కల్పించనున్నట్లు మండల వ్యవసాయాధికారి మురళీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీలకు వందశాతం రాయితీ, బీసీ, ఇతరులకు 90శాతం రాయితీ, ఐదు ఎకరాల్లోపు ఉండే ఓసీలు, ఇతరులకు 90 శాతం, ఐదెకరాలు దాటినట్లయితే 80శాతం రాయితీ కల్పించడం జరుగుతుందన్నారు. వివరాలకు క్లస్టర్ పరిధిలోని ఏఈఓలను సంప్రదించాలని తెలిపారు.

పనులు నాణ్యతగా చేపట్టండి

మహమ్మదాబాద్: గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మంగంపేట్ సర్పంచ్ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం మండలంలోని మంగంపేట్‌లో రూ.10లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో వీధిదీపాలు, డ్రైయినేజీలు, సీసీరోడ్ల నిర్మాణాలు వేగవంతం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన

గండీడ్: క్విజ్ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థిని ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు. మండలంలోని చిన్నవార్వాల్ ఉన్నత పాఠశాలలో హర్షవర్ధన్ తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. సైన్స్‌డే సందర్భంగా మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో ప్రథమ బహుమతి పొందాడు. మంగళవారం ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వీరసేన్‌గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మినీ వాటర్‌ట్యాంకు ప్రారంభం

బాలానగర్: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో కాలనీవాసుల తాగునీటి సమస్య పరిష్కారం కోసం బాలానగర్ సర్పంచ్ విజయలక్ష్మి సొంత ఖర్చుతో మినీవాటర్ ట్యాంకును నిర్మించి మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జగన్, డిప్యూటీ సర్పంచ్ గిరిధర్ రావు, యువకులు భాస్కర్ గౌడ్, రాము, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కందూరులో వేలం

అడ్డాకుల: మండలంలోని కందూర్ సమీపంలో స్వయంభూగా వెలిసిన శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ఆలయం వద్ద కొబ్బరికాయలు, ప్రసాదాలు, తలనీలాల కోసం బహిరంగ వేలం నిర్వహించారు. ఆలయ చైర్మన్ రమేష్‌గౌడ్, సర్పంచ్ శ్రీకాంత్, ఆలయ ఈఓ రాజేశ్వరశర్మ ఆధ్వర్యంలో స్థానిక కల్యాణ మండపంలో బహిరంగ వేలం నిర్వహించారు. కొబ్బరికాయల విక్రయాలను రూ.8.31 లక్షలు, ప్రసాదాల విక్రయాలను రూ.7.01లక్షలు, తలనీలాలను రూ.81వేలకు పాడారు. బహిరంగ వేలం ద్వారా ఆలయానికి రూ.16.13లక్షల ఆదాయం సమకూరింది.

క్రీడల్లో గెలుపోటములు సహజం



బాలానగర్: క్రీడల్లో, రాజకీయాల్లో ఎక్కడైనా గెలుపు, ఓటములు సహజమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జనంపల్లి అనిరుధ్ రెడ్డి అన్నారు. గత నెల 18న ప్రారంభమైన ఉమ్మడి బాలానగర్ మండల క్రికెట్ టోర్నమెంట్ మంగళవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఆయన క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. విజేతలకు అనిరుధ్ రెడ్డి మొదటి బహుమతిగా రూ.51వేలు, ద్వితీయ బహుమతి రూ.21వేలు, షీల్డ్ అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రమాణారెడ్డి, శంకర్‌నాయక్, శివకుమార్, లక్ష్మణ్‌నాయక్, దత్తు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

నవాబుపేట: జిల్లా కేంద్రానికి చెందిన 15ఏళ్ల బాలిక సంక్రాంతి పండుగ కోసం అమ్మమ్మ గ్రామమైన నవాబుపేటకు వచ్చి ఇక్కడే ఉంటుంది. మంగళవారం అమ్మమ్మ ఇంటి నుంచి వెళ్లిపోగా, ఎక్కడ వెతికినా ఆచూకీ తెలియలేదని బాలిక తల్లి మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కాగా, మహబూబ్‌నగర్ పట్టణంలోని కోయిల్‌కొండ రోడ్డులో గల విజయ్ అనే వ్యక్తి బాలికను కిడ్నాప్ చేశాడని బాలిక తల్లి ఆరోపించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పురుషోత్తం తెలిపారు.

యువకుడు..

మిడ్జిల్: మండలంలోని బైరంపల్లికి చెందిన బోడ రాజు కుమారుడు బోడ అనిల్ కుమార్(17) జనవరి 21న ఇంటి నుంచి జడ్చర్లకు పండ్లు తీసుకొస్తానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో మంగళవారం యువకుడి తల్లి జ్యోతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామ్‌లాల్‌నాయక్ తెలిపారు.

ఉద్యోగాలు కల్పిస్తాం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): యువత భవిష్యత్తే తమకు ముఖ్యమని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం దివిటిపల్లిలోని ఐటీ కారిడార్‌ను పరిశీలించిన అనంతరం విద్యార్థులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. నిధులు, నియామకాలు, నీళ్ల కోసం కొట్లాడి సాధించుకున్న తెలంగాణను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపడమే లక్ష్యమన్నారు. 400ఎకరాల్లో ఐటీ కారిడార్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో 40 నుంచి 50 పరిశ్రమలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. పరిశ్రమలు వస్తే ఇక్కడే ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ నర్సిములు, ముడా చైర్మన్ వెంకన్న పాల్గొన్నారు.